

## ప్రజా పాలనతోనే అభివృద్ధి సాధ్యం

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ప్రజా పాలనతోనే అభివృద్ధి సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్ అన్నారు. గురువారం బెజ్జూర్ మండలం అంబగట్ట గ్రామపంచాయతీలో నూతన అంగన్వాడి భవనాన్ని పంచాయతీరాజ్ ఇంజనీర్ మక్బూల్ తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పేదవాడి సొంతింటి కలను సహకారం చేస్తూ ఇందిరమ్మ ఇండ్లను అందించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి రేషన్ కార్డుదారుడికి నూతన రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని, అలాగే సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఇలా ప్రతి కార్యక్రమాన్ని అంచెలంచెలుగా పూర్తి చేసుకుంటూ ఎన్నికల హామీలన్నీనెరవేరుస్తున్నామని చెప్పారు. ప్రతిపక్షాలు కావాలనే కాంగ్రెస్ పై విమర్శలు చేస్తున్నాయని, ప్రజల్లో కాంగ్రెస్ పై విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతి, అంగన్వాడి, ఉపాధ్యాయురాలు తలాన్ని కల్పన, కాంగ్రెస్ నాయకులు సండే బాబురావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం జరిగిందని మండల విద్యాధికారి సునీత తెలిపారు. ఈ సంవత్సరం సెప్టెంబర్ 5న షబే బరాత్ మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా సెలవు దినం రావడంతో ముందస్తుగా పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదిలో విద్యాబోధన చేశారని తెలిపారు. ఉపాధ్యాయులు కొవ్వొత్తుల వంటివారని, ఇతరులకు వెలుగునిచ్చేందుకు తమను తాము దహించుకుంటారని అన్నారు. వారు విద్యార్థులను మార్గనిర్దేశం చేస్తారని, వారికి మద్దతు ఇస్తారని చెప్పారు. పుస్తకాల నుంచి మాత్రమే కాకుండా జీవితం నుంచి కూడా పాఠాలు బోధిస్తారన్నారు. పాఠశాలలో వేసే మొదటి అడుగు నుంచి పట్టభద్రులయ్యే వరకు, ఉపాధ్యాయులు విద్యార్థులతోనే ఉంటారన్నారు. విద్యార్థులు ఎదగడానికి ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తారన్నారు. అందుకే గురువును బ్రహ్మ విష్ణువు మహేశ్వరులు వంటి త్రిమూర్తులతో పోలుస్తారని తెలిపారు. గురువుల మాటను విన్న ఉపాధ్యాయులు విశ్వాన్ని ఏలుతున్నారని, ప్రతి విద్యార్థి వినమ్రతతో గురువులు చెప్పిన మాటలు విని భవిష్యత్తులో ఎదగాలని ఆకాంక్షించారు.

## నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు



**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని జనహిత సేవ సమితి సభ్యులు డోలి సుకుమార్ అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన డోలి కృష్ణమూర్తి గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. మృతుడి కుటుంబ సభ్యులను నేత్రదానం కోసం అంగీకరించేలా చేశారు. దీంతో మృతుడి భార్య డోలి పుష్ప, కుమారులు డోలి నాగేంద్ర ప్రసాద్, డోలి సాయికృష్ణ తన తండ్రి నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. వారి కుటుంబ సభ్యులైన డోలి సుధీర్ పర్యవేక్షణలో సదాశివ ఫౌండేషన్ సహకారంతో వాసన్ ఐ బ్యాంక్ సిబ్బంది నేత్రలను స్వీకరించారు. నేత్రదానం చేసిన డోలి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు జనత సేవా సమితి అధ్యక్షులు ఆడెపు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

## గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం మేజర్ తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నిర్వహించే గణేష్ శోభయాత్ర అనంతరం నిమజ్జన కార్యక్రమ ఏర్పాట్లకు అన్నిరకాల సౌకర్యాలను సమకూర్చడం జరిగిందని తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. అన్ని శాఖల అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది స్థానిక పెద్ద చెరువు, రైల్వే స్టేషన్ సమీపంలో గల అండర్ బ్రిడ్జి వద్ద గల వాగు వద్ద నిమజ్జనానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను అక్కడ సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో శోభయాత్రను కొనసాగించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతిఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు.



# విద్యారంగ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం తాండూర్ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో షెడ్యూల్డ్ తెగల సంక్షేమ వసతి గృహ ఏర్పాటు కోసం మండల తహశీల్దార్ జ్యోత్స్నతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం అన్ని సదు-పాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో తాండూర్ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో ఎస్టీ సంక్షేమ వసతి గృహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించడం జరిగిందని తెలిపారు. అనంతరం తాండూర్ మండల కేంద్రంలో వినాయక నిమజ్జనానికి పెద్ద చెరువు ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ ఎ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తహశీల్దార్ జ్యోత్స్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ లతో కలిసి పరిశీలించారు. వినాయక శోభయాత్ర అనంతరం నిమజ్జన కార్యక్రమాన్నిప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ ప్రాంతంలో శ్రీ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, నిమజ్జన ప్రాంతంలో లైట్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశామని అన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన వినాయక మండళ్లు రిజిస్ట్రేషన్ అయిన ప్రకారం ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులకు తావులేకుండా రూట్ మ్యాప్ సిద్ధం చేయడం జరిగిందన్నారు. మండళ్ల నిర్వాహకులు మార్గదర్శకాలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించడం జరిగిందని మండల విద్యాధికారి మల్లేశం తెలిపారు. తాండూర్ మండలంలోని మండల ప్రాథమిక పాఠశాల రేచిని ప్రధాన ఉపాధ్యాయురాలు భాష జయప్రద, మండల ప్రాథమిక పాఠశాల కొత్తపల్లి హెచ్ఎం స్వరూప, జిల్లా పరిషత్ హైస్కూల్ అచలాపూర్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు పి ఉమాదేవి, మండల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు దేవదాస్, జిల్లా పరిషత్ హైస్కూల్ తాండూర్ లో సీనియర్ ఉపాధ్యాయురాలు లత, సోషల్ స్టడీస్ జిల్లా పరిషత్ హైస్కూల్ రేచినిలో పని చేస్తున్న నాగరాణి, ఎస్ఎస్ సోషల్ స్టడీస్ కేజీబీవీ తాండూర్ లో పనిచేస్తున్న సిఆర్టి సుధారాణి, జిల్లా పరిషత్ హై స్కూల్ తంగళ్ళపల్లి ఎం నరేందర్, ఎస్సే మ్యాథమెటిక్స్ లను ఘనంగా సత్కరించారు. తంగళ్ళపల్లి పాఠశాలలో నిర్వహించిన టీఎల్ఎం మేళాలో ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి తాండూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దుర్గం శ్రీనివాస్, జెడ్పీహెచ్ఎస్ అచలాపూర్ కాంప్లెక్స్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు పి ఉమాదేవి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్ఐసి వారోత్సవాలు




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లా కేంద్రంలోని ఎల్ఐసి కార్యాలయంలో భీమా వారోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. మొదటగా సంస్థలో పనిచేసిన సీనియర్ ఏజెంట్ లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సుభాష్ మాట్లాడుతూ ఏ ఎల్ఐసి సంస్థ ప్రారంభించి 69 సంవత్సరాలు పూర్తయ్యాయని, కోట్ల రూపాయల లాభాలతో సంస్థ ముందుకు వెళుతుందని అన్నారు. దేశంలో ప్రతి ఒక్కరికీ భీమా కల్పించడమే ఎల్ ఐ సి లక్ష్యం అన్నారు. ఇప్పటివరకు చాలా మంది కి భీమా అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డెవలప్మెంట్ ఆఫీసర్స్ సింగం నర్సయ్య, శ్రీధర్, ఏజెంట్ లు బట్టుపల్లి అశోక్, అడపా సతీష్, జాడి తిరుపతి, శ్రీనివాస్ రాజు, అరుణ్, శ్రీరామ్, మల్లేష్, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

### మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** పండగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మంచిర్యాల ఏసీపీ వెంకటేశ్వర్లు, జైపూర్ ఏసీపీ ప్రకాష్ లు పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల వంద ఫీట్ల రోడ్డు సమీపంలో గల అంజనీపుత్ర రియల్ ఎస్టేట్స్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని అంజనీపుత్ర సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి శాలువతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు ఏసీబీలు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా పండగలు ఆధ్యాత్మికంగా, శాంతియుత మార్గంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఐక్యతతో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా వినాయక చవితి, నిమజ్జనోత్సవాన్ని నిర్వహించుకోవాలన్నారు. అనంతరం అంజనీపుత్ర సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి మాట్లాడుతూ సామాజిక సేవలో అజనీపుత్ర సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుదన్నారు. ఈ కార్యక్రమంలో అజనీపుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సూరినేని కిషన్, కాసర్ల సదానందం, డైరెక్టర్లు, స్థానిక సీఐ, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



# వినాయక నిమజ్జనాన్ని శాంతియుతంగా జరుపుకోవాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వినాయక నవరాత్రుల అనంతరం శోభయాత్ర నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రజలందరూ సమన్వయంతో శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా శోభయాత్ర నిర్వహించే రూట్ మ్యాప్, ఇతర ఏర్పాట్లను రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ ఎ భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గణేష్ శోభయాత్ర కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో రూట్ మ్యాప్ రూపొందించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన గణేష్ మండళ్ల వివరాలను నమోదు చేయడం జరిగిందని, దీనికి అనుగుణంగా రూపొందించిన రూట్ మ్యాప్ ను ఆయా మండళ్ల నిర్వాహకులు అనుసరించాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్, మత్స్యశాఖ, పోలీస్, రెవెన్యూ సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. నిమజ్జన కార్యక్రమాన్నిప్రశాంతంగా జరిగే విధంగా సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. భద్రత దృష్ట్యా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం, నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్, గజఈతగాళ్లను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. అనంతరం రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్, మంచిర్యాల డీసీపీ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి జైపూర్ మండలం ఇందారం సమీపంలోని గోదావరి వంతెనపై నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వినాయక శోభయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారులకు న్యాయం జరిగేదాకా పోరాటం

**తల్లి, పిల్లలు, కుటుంబాన్ని కలపడమే లక్ష్యం**

## మీడియా మిత్రులకు విజ్ఞప్తి

సమాజ నిర్దేశకులుగా ఉన్న మీడియా మిత్రులు కూడా ఈ ఘటనపై మాట్లాడకపోవడం కొంత విస్మయానికి గురి చేస్తున్నదని సాహెర బాను ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఓ కుటుంబం కకావికలం అవుతున్నా కనీసం మానవతా దృక్పథంతో కూడా ఆలోచించకపోవడం నిజంగా జీర్ణించుకోలేని పరిస్థితి అని అన్నారు. మీడియా మిత్రులకు చేస్తున్న విజ్ఞప్తి ఏంటంటే.. పిల్లలకు తల్లి ప్రేమ అందించేందుకు కృషి చేద్దామని, తాను కూడా తోడు ఉంటానని, మీడియా మిత్రులు కూడా మానవీయకోణంలో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

### మహిళా మిస్సింగ్ కేసులో అధికారులు మౌనం వీడి పిల్లలకు న్యాయం చేయాలి

- ఓ కుటుంబాన్ని వీధిన పడకుండా కాపాడాలి
- కలెక్టర్‌సీసీపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?
- బాధ్యతాయుతమైన పోస్టులో ఉండి ఇలా చేయడం సరైనదేనా?
- ఓ మిస్సింగ్ కేసులో డీపీఆర్‌వో ఇన్వాల్‌మెంట్ ఏంటిది?
- ఇంత రాద్ధాంతం జరుగుతున్న పట్టింపు ఎందుకు లేదు?
- జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సాహెర బాను



(ఉద్యమ కెరటం, డైనమిక్ బ్యూరో)

టీచర్ రమేశ్-సఖి సెంటర్ సీవో పిల్లలకు న్యాయం జరిగేదాకా పోరాటం ఆగదని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సాహెర బాను స్పష్టం చేశారు. పిల్లలు తల్లి చెంత చేరాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. గురువారం ఆమె 'ఉద్యమ కెరటం'తో మాట్లాడారు. ఓ తల్లి పిల్లలను వదిలి వెళ్లపోవడం తనను చాలా కలచి వేసిందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి ఎవరికి రావొద్దన్నారు. ఎంతలా బాధపడితే పదమూడేళ్ల పాప, ఏడేండ్ల బాబు మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తారని ప్రశ్నించారు. చర్యలు తీసుకోవాల్సిన జిల్లా యంత్రాంగం, సఖి సెంటర్‌బాధ్యతులు పట్టించుకోకపోవడం మూలంగానే ఈ రోజు పిల్లలు మహిళా కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. మన పిల్లలు అలా బాధపడితే మనం ఓర్చుకోగలమా? అని ప్రశ్నించారు. ఆ పిల్లలు ఎలాగైనా 'మా అమ్మ'ను మాకు అప్పగించండి అని వేడుకోవడం చూసి తనకు కన్నీళ్లు ఆగలేదన్నారు. వారి దీనావస్థ చూసి హృదయం కలచివేసిందన్నారు. అధికారులతో తనది ఒక్కటే విన్నపమని, పిల్లలను తల్లితో కలపాలని విజ్ఞప్తి చేశారు.

### కలెక్టర్ గారు స్పందించాలి..

సీసీ రమణ విషయంలో కలెక్టర్ స్పందించాలని సాహెర బాను డిమాండ్ చేశారు. మొత్తం యంత్రాంగాన్ని సరిదిద్దే కలెక్టర్‌ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారనే విషయం అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఈ విషయం కలెక్టర్‌దృష్టి రాలేదని చెప్పడానికి కూడా లేదని ఎలా అనుకుంటామని అడిగారు. భర్త రమేశ్‌తన భార్య మిస్సింగ్‌గురించి వీడియో విడుదల చేసిన కొద్దీ సేపటికే సదరు మహిళ దానికి కౌంటర్‌ఇస్తూ వీడియో రిలీజ్‌చేయడం.. తన భర్త, కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేయడం.. ఆ వీడియో ఏకంగా జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్‌వో) మీడియాకు ఫార్వర్డ్ చేయడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. డీపీఆర్వో వార్తలను జనాలకు అందించేలా ఉండాలనే కానీ, ఏకంగా మిస్సింగ్‌కేసులో ఇన్‌వాల్వ్‌కావడం ఏంటని ప్రశ్నించారు. డీపీఆర్‌వో ఫార్వర్డ్‌చేయడానికి అది ప్రజా ఉపయోగకరమైన వార్త కాదు కదా? అని అనుమానం వ్యక్తం చేశారు. నిజంగా కోట్ల రూపాయలు వారి వద్ద ఉన్నాయా? ఉంటే అవి ఎవరివి? దానికి గురించి ఎందుకు మాట్లాడటం లేదు? అని ప్రశ్నించారు. ఈ పుకార్లు, షికార్లకు కలెక్టరే తెరదించాలని చెప్పారు.

### కలెక్టర్ సీసీ ఎక్కడ?

కలెక్టర్ సీసీ కే రమణపై రమేశ్ ఫిర్యాదు చేసినా ఆయన జాడ లేకపోవడం ఏంటమని సాహెర బాను ప్రశ్నించారు. తన భార్యను కిడ్నాప్‌చేశాడని ఆరోపించినా సీసీ కనీసం స్పందించకపోవడం ఏంటని అడిగారు. ఏవరైనా మనపై ఆరోపణలు చేస్తే దానిని ఖండించాలి.. వివరణ ఇవ్వాలి.. తాను తప్పు చేయలేదని చెప్పాలి. కానీ, ఇక్కడ అలాంటి ఏమి జరగకపోవడంతో జనాల అనుమానాలకు బలం చేకూర్చుతున్నదన్నారు. ఆయన ఎందుకు బయటికి రావడం లేదు? సమాధానం ఎందుకు చెప్పడం లేదనేది ఆరోపణలకు బలం చేకూర్చుతున్నది. ఈ ఘటన నేపథ్యంలో ఆయన సెలవుపై వెళ్లారా? వెళ్తే ఆ సెలవును ఏ ప్రాతిపదికన అప్రూవ్‌చేసుకున్నారు? ఆయన సెలవుపై వెళ్తే మాత్రం కచ్చితంగా కలెక్టర్‌అప్రూవల్‌కావాల్సిందే.. ఆయన గురించి సమాచారం లేకపోవడం అనుమానించాల్సిన పనే అని పేర్కొన్నారు.

# సంచలనం సృష్టించిన ఉద్యమ కెరటం కథనాలు



**'ఆ-ఇద్దరి' ఉదంతంపై వార్తలపై పలువురి అభినందనలు**

**ప్రత్యేకంగా ఫోన్లు చేస్తూ మరిన్ని సూచనలు అందించిన అభిమానులు**

**వార్త కథనాల ప్రెసెంటేషన్ భేష్ అంటూ కితాబు**

(ఉద్యమ కెరటం, డైనమిక్ బ్యూరో)

వివాహిత అదృశ్యం.. భర్త దైన్యం.. చిన్నారుల విలాపంపై 'ఉద్యమ కెరటం' మొదటి నుంచి అందిస్తున్న కథనాలు రాష్ట్ర, జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆసిఫాబాద్ కలెక్టర్ 'సీసీ రమణ-సఖీ సెంటర్ సీఓ మమత'ల రహస్య 'అదృశ్యం' వెనుకున్న బాగోతం పలువురిని విస్మయానికి గురి చేసింది. తొలుత 'వివాహిత అదృశ్యం-వివాదాస్పదం' శీర్షికన ప్రచురితం కాగా.. వెంటనే రెండో కథనంగా.. 'వివాహిత అదృశ్యం కేసులో మరో మలుపు' శీర్షికన ప్రచురితమైంది. ఇక మూడో భాగంగా ప్రచురితమైన 'మాయం' వెనుక మత్ 'లబ్ - డబ్బు' కథనం కలకలం సృష్టించింది.! ఈ ఉదంతంపై వరుస కథనాలు అందిస్తోన్న 'ఉద్యమ కెరటం' దినపత్రికపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఉదంతం వెనుక నిజంగా ఆ చిన్నారుల 'తల్లిదండ్రుల' మధ్య కుటుంబ కలహాలే ఉన్నాయా? లేక.. అదృశ్యమైన ఆ వివాహిత 'రహస్య స్నేహితుడి'తో ఇంకేదైనా బంధం ఉందా? లేక వారి వద్ద రూ.2-3 కోట్లు ఉన్నాయని




జరుగుతున్న ప్రచారంలో వాస్తవమెంత? అదృశ్యమైన వివాహిత భర్త రమేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కలెక్టర్ సీసీ రమణ పేరును ఎందుకు చేర్చలేదు? పోలీసులకు ఆదేశాలు ఇచ్చింది ఎవరు? ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? మధ్యలో 'మాయమైన వివాహిత' వీడియో డీపీఆర్వో విడుదల చేయాల్సిన అవసరం ఏంటీ? ఎవరి ప్రోద్బలంతో మీడియాకు రిలీజ్ చేశారు? అలా రిలీజ్‌చేసే అధికారం డీపీఆర్వోకు ఉందా? ఈ పూర్తి ఉదంతం మిస్టరీ వీడాలంటే కలెక్టర్ నోరు విప్పితే గానీ.. బండారం బయట పడేట్టు లేదని వరుసగా ప్రచురితమవుతోన్న 'ఉద్యమ కెరటం' పాఠకులు చెవులు కొరుక్కుంటున్నారు.

### చిన్నారుల కన్నీరు - వ్యవస్థ వైఫల్యం

ఆసిఫాబాద్ జిల్లాలో మహిళా మిస్సింగ్ కేసు చుట్టూ ఒక కుటుంబం చిగురుటాకులా వణుకుతుంటే.. అధికారులు మాత్రం మౌనవ్రతం వహిస్తూ కూర్చోవడం విస్మయం కలిగిస్తోంది. పదమూడేళ్ల పాప, ఏడేళ్ల బాబు 'మా అమ్మ మాకు కావాలి' అంటూ మహిళా కమిషన్ ఎదుట కన్నీరు పెట్టుకోవడం ఈ జిల్లా యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సాహెర బాను ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'చిన్నారులు తల్లిని చేరేవరకూ ఈ పోరాటం ఆగదు' అని ఆమె స్పష్టం చేశారు.

### చిన్నారుల విలాపన - తల్లిని కోరుతూ విన్నపం

తల్లి కోసం విలవిల్లాడుతున్న చిన్నారుల ఆవేదన ఎవరి హృదయాన్నైనా కదిలించాల్సిందే. 'మన పిల్లలు ఇలాంటివాళ్లుగా మారితే మనం ఊరుకుంటామా?'అని సాహెర బాను ప్రశ్నించారు. ఒక తల్లి ఇంటి నుంచి దూరమవ్వడం, పిల్లలు కన్నీటి పర్యంతం అవ్వడం, అధికారుల నిర్లక్ష్యంతో వారిని మహిళా కమిషన్ శరణు చేరే పరిస్థితి రావడం బాధాకరమని ఆమె అన్నారు.

### జిల్లా కలెక్టర్ మౌనం - అనుమానాల వనం

ఈ కేసులో జిల్లా కలెక్టర్ ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్న ఇప్పుడు ప్రతి ఒక్కరి మనసులో మెదులుతోందని సాహెర బాను వ్యాఖ్యానించారు. 'ఒక జిల్లా కలెక్టర్ మొత్తం యంత్రాంగాన్ని కదిలించే శక్తి కలిగి ఉంటారు. కానీ ఇక్కడ మాత్రం ఏ మాత్రం స్పందన లేదు. ఈ కేసు కలెక్టర్ దృష్టికి రాలేదనడం ఎవరూ నమ్మలేరు' అని ఘాటుగా ఎద్దేవా చేశారు.

### కలెక్టర్ సీసీ ఎక్కడ? - కీలక ప్రశ్న!

ఈ కేసులో అసలు మర్మం కలెక్టర్ సీసీ కే రమణ చుట్టూనే తిరుగుతోందని సాహెర బాను ఎత్తి చూపారు. భర్త రమేశ్ తన భార్యను సీసీ కిడ్నాప్ చేశాడంటూ స్పష్టంగా ఆరోపించినా ఆయన ఇప్పటికీ జాడలేకపోవడం, ఒక్క వివరణ ఇవ్వకపోవడం ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతోందన్నారు. 'సీసీ రమణ' నిజంగా సెలవుపై ఉన్నారా? అయితే దానికి కలెక్టర్ అప్రూవల్ ఎక్కడ? ఆయన గురించి జిల్లా యంత్రాంగం ఎందుకు సమాచారం ఇవ్వడం లేదు?' అంటూ ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. ఇలా దాగుడుమూతలాడడం వల్లే ఆరోపణలకు బలం చేకూరుతోందని తేల్చిచెప్పారు.







## ఉద్యమ కెరటానికి మరింత ఉప్పందించిన అభిమానులు

'ఉద్యమ కెరటం' దినపత్రికకు ఫోన్‌కాల్స్ వెల్లువెత్తడంతో పాటు అవినీతి, అక్రమాలపై మీ పోరాటం ఇలానే ఉండాలని పలువురు అభిమానులు, మేధావులు, పలు సంఘాల నాయకులు ఆకాంక్షించారు. అన్యాయాలపై 'ఉద్యమ'ం కొనసాగించాలని ధైర్యం నూరిపోశారు. జిల్లాలో జరుగుతున్న మరిన్ని అక్రమాలు, అన్యాయాలపై చర్చించారు. ఆ అక్రమాలు, అన్యాయాలపై ఉప్పందించేందుకు సిద్ధమయ్యారు. తమ దగ్గర కొన్ని ఆధారాలు ఉన్నాయని, వాటిని కూడా ఇస్తామని చెప్పారు. వాటి గురించి కథనాలు రాసేందుకు 'ఉద్యమ కెరటం' సుముఖంగా ఉండటంపై హర్షం వ్యక్తం చేస్తూ పత్రికకు అన్ని విధాలుగా అండగా నిలబడతామని స్పష్టం చేశారు.

